/

## సురభి నాటక సమాజాలు : విశిష్టత

### ఆచార్య మొదలి నాగభూషణ శర్మ

ఆధునిక తెలుగు నాటకం 1872లోనే ప్రారంభమైనా ప్రదర్శనలు మాత్రం కందుకూరి వీరేశలింగం పంతులుగారి "వ్యవహార ధర్మబోధిని"తో 1880లోనే ప్రారంభమయ్యాయి. యక్షగాన వీధి నాటకాల నుంచి సమాజ స్పృహ ఉన్న నాటకాల రచన, ప్రదర్శనలు సాగుతున్నా మరొకపక్క వీధినాటకాలు, ఇంకొకపక్క కొత్తగా పార్సీవారి ప్రభావంతో వస్తున్న "సంగీత నాటకాలు" క్రమంగా బలం పుంజుకుంటున్నాయి. సామాజిక స్పృహతో వస్తున్న నాటకాలను చదువుకున్నవారు, బస్తీలలో వున్నవారు ఆదరిస్తే సంగీత నాటకానలు అటు బస్తీవారు, ఇటు పల్లెప్రజలు కూడా ఆదరించారు, ప్రజలు ఆదరించే వినోదాన్ని పంచిన మాధ్యమం సంగీత నాటకం. ధార్వాడ కంపెనీ 1880లోను, పూనా కంపెనీ 1882 నుంచి పలుమార్లు ఆంధ్రదేశ్ పర్యటన చేశాయి. ధార్వాడ కంపెనీ అప్పుడే వస్తున్న ఆధునిక గద్య నాటకానికి పెద్దపీట వేసింది. పూనా కంపెనీ, ఆ తరువాత వెంటవెంటనే ఆంధ్రదేశం వచ్చిన విక్టోరియా థియాట్రికల్ కంపెనీ, బొలీవాలా కంపెనీలు సంగీత నాటకానికి పట్టంకట్టాయి. సంగీతమే ప్రధానంగా ఉండి, ఆర్థిక స్తోమతు వున్న కొన్ని నాటక సంఘాలు సంగీత నాటక సంస్థలుగా ప్రాముఖ్యం సంపాదించాయి. 1882-1900 మధ్యకాలంలో అనేక పాక్షిక వృత్తి సంఘాలు సంగీత నాటక ప్రదర్శనలకు పూనుకున్నాయి. పద్య నాటకానికి పెద్దపీట వేసినవి అవే ! అలాకాక పార్సీనాటకాల రూపిందిన నాటక సంస్థలలో పేర్కొనవలసిన సంస్థ సురభి నాటక సంస్థ. 120 సంవత్సరాలు నిర్విఘ్నంగా, నిరాటంకంగా, విజయవంతంగా కొనసాగిన సంస్థ కూడా సురభే !

సురభి నటీనటులు తెలుగువారు కాదని, కొన్నాళ్ళ క్రిందటివరకు వాళ్ళు 'ఆరె' అనే మరాఠీ మాండలికం మాట్లాడేవారని, ఒకానొక అవసర సమయంలో తోలుబొమ్మలాటను వృత్తిగా చేసుకుని జీవనం గడిపారనీ చాలమందికి తెలుసు. ఈ మరాఠీలు ఎప్పుడు ఆంధ్రదేశంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారో చెప్పడం కష్టమయినా, ఊహించవచ్చు, రెండవ శివాజీ తంజావూరు రాజధానిగా మరాఠీ మహారాజు శివాజీ పనుపున బయలుదేరినప్పుడు ఆయనతో చాలా పెద్ద బలగం వచ్చింది. వారిలో ఎక్కువ మంది సైనికులు, మరాఠీల, నాయకరాజుల కాలంఓల వారు సైన్యంలో వుండి సామ్రాజ్యాన్ని కాపాడడానికి కృషిచేశారు. ఆ సామ్రాజ్యాలు పోయినవెనుక చిన్న చిన్న పాలెగాళ్ళ కొలువుల్లో చేరారు. వాళ్ళ పక్షాన దోపడిడి దొంగల నుంచి ప్రజలను కాపాడడానికి కొన్నిచోట్ల గ్రామ నాయకులుగా వున్నారు. బందిపోట్ల బాదరబంది తగ్గి ఆంగ్ల పాలకుల పక్షాన గ్రామ పాలకులను నియమించిన నాటి నుంచి వారికి ఆ ఉద్యోగాలు పోయాయి. తాము ఉన్న ఊళ్ళలో ఏ ఉద్యోగాలు దొరికితే ఆ ఉద్యోగాలలో చేరి భార్యా బిడ్డలను పోషించుకోవడం మొదలు పెట్టారు.

ఇటువంటి ఒక కుటుంబ పెద్ద వనారస సంజీవరావు,ఆయన భార్యలు చెన్నమ్మ, అంజనమ్మ, వనారస, వారితోపాటు వారికి దగ్గరబంధువులైన మరో మూడు ప్రధాన కుటుంబాలు - అవేటి, రేకందార్, సింధే - వ్యవసాయం ప్రధాన వృత్తిగా రాయలసీమలో జీవనం వెళ్ళబుచ్చుతున్నారు. ఇందులో కొందరు ఒక్కద భుక్తి గడవక తెలంగాణా ప్రాంతాలయిన రామదుర్గం, బాలకొండ ప్రాంతాలలో స్థిరపడ్డారు. అక్కడ కూడా యీ నాలుగు కుటుంబాలవాళ్ళూ ఉన్నారు. కాని నాటక ప్రదర్శనలకు సంబంధించిన వనారస మొదలైన నాలుగు కుటుంబాల వాళ్ళను 'సురభి' వారుగా గుర్తిస్తారు.

వనరాస సంజీవరావుగారికి కొంత వ్యవసాయం, కొంత సారా వ్యాపారం వుండేది. ఆయన కొంచెం ఉద్రేకి. అమ్మవారి జాతరలో ఎవరో ఒకరు అమ్మవారికి బలి అయితే తప్ప వానలు కురవు అని అంటే తాను ముందుకు వచ్చి అక్కడున్న శూలానికి తన్నుతాను బలి యిచ్చుకున్నాడు. తమ్ముడి పిల్లలతో వచ్చిన తగాదాలలో ఉన్న ఆస్తిని వారికి అప్పచెప్పి పిల్లలను బికారులను చేసి ఆయన వెళ్ళిపోయాడు. అప్పటికే చెన్నమ్మ, అంజనమ్మలకు పదిమంది సంతానం - చెన్నమ్మకు ఆరుగురు మగ సంతానం, ఒక ముగ్గురు తమ తమ జీవికలకోసం వారికిష్టమైన పనులు చేసుకుంటున్నారు. తరువాతి ముగ్గురు కృష్ణాజీ, వెంకోజీ, రామోజీ - తల్లుల సాయంతో తమకు వచ్చిన సంగీతజ్ఞానంతో ఆనాడు బహుళ ప్రచారంలో వున్న తోలుబొమ్మలాటను

నేర్చుకొని దానినే తమకు జీవికగా ఎన్నుకున్నారు. తల్లులతోను, చెల్లెళ్ళతోను ఊళ్ళు తిరుగుతూ బొమ్మలాటలు ప్రదర్శిస్తున్నారు. ముగ్గురు అన్నదమ్ములు, రెండో భార్య కుమార్తె అమ్మణ్ణమ్మ బొమ్మలాట ప్రదర్శనలలో ఆరిదేరారు. ఇది 1875 నాటి సంగతి.

1878లో కడప తాలూకాలోని హనుమద్గుండం అనే గ్రామంలో బొమ్మలాటకు వెళ్ళింది ఈ కుటుంబ. అక్కడ మశూచితో బాధపడుతూ ఉవున్న పకీరన్న అనే అనాధ పిల్లవడిని చూసి జాలిపడి, తమతో తీసుకువెళ్ళారు. అతనికి నెమ్మదించిన తరువాత వెంకోజీ ఆయన భార్య సుంతమ్మలు ఆ పిల్లవాడిని పెంచుకొని అతనికి 'గోవిందప్ప' అని పేరుపెట్టుకున్నారు. అతడే సురభి నాటకాలకు మూలసూత్రధారి వనారస గోవిందరావు.

అలాగే పెదరామయ్యగారని పిలవడే రామోజీ పాపాబాయిని, కృష్ణాజీ చిన్నరామయ్యను పెంచుకున్నారు. (పాపాబాయి చెన్నమ్మ రెండో కొడుకు సుబ్బయ్యగారి కూతురు. పెరదామయ్యగారు పెంచుకున్నారు. ఆటపాటలలో మేటి) అంటే కృష్ణాజీ, వెంకోజీ, రామోజీలుకాక అలసు చెల్లెలు అమ్మణ్ణమ్మ, ముగ్గురు పెంచుకున్న పిల్లలు గోవిందరావు, పాపాబాయి, చినరామయ్యలతో సంపూర్ణమయిన ప్రదర్శక బృందం ప్రదర్శనలిస్తూ వుండేదన్నమాట.

గోవిందప్ప తన తండ్రుల దగ్గర నుంచి మృదంగం, వయొలిన్‌లతో పాటు సంగీతం (బొమ్మలాటలకు కావలసినంత) నేర్చుకున్నాడు. గ్రామంలో బొమ్మలాట అయిపోయిన మర్నాడు ఉదయం ఇంటింటికీ వెళ్ళి ఇంటి యజమానులను యాచించి ధాన్యం, బట్టలు తెచ్చుకోవడం ఆనవాయితీ, గోవిందప్పకు ఈ పద్ధతి బొత్తిగా నచ్చలేదు. యాచకవృత్తి వద్దని తల్లిదండ్రులకు చెప్పాడు. కాని వారికి మరొక పద్ధతి తెలియకపోవడంతో గోవిందప్పను మందలించి తమ బొమ్మలాటను ఆడుకుంటూ వెళ్ళారు.

ఇలా అయిదారేళ్ళు గడిచాయి. గోవిందప్ప అసహనం పెరగిపోతున్నది. ఒకరోజు అతడు ఎవరికీ చెప్పకుండా నంద్యాలలో వున్న జ్యోతి సుబ్బయ్య కంపెనీకి వెళ్ళి అందులో చిన్న చిన్న పనులు చెయ్యడానికి కుదిరాడు. జ్యోతి సుబ్బయ్య కంపెనీ వీధి నాటకాల సమాజం. అందరూ ఆడవాళ్ళే - అందరూ దేవదాసీలు - అక్కడ దాదాపు ఆరేడు నెలలు ఉండి నాటకాలు ఆడే పద్ధతి చూసి తెలుసుకున్నాడు. ఇంతలో కొడుకుకోసం వెతుకుతున్న తల్లిదండ్రులు నంద్యాలలో ఉన్నాడని తెలుసుకొని, వెతికి పట్టుకుని ఇంటికి రమ్మని బ్రతిమాలారు. తమ కుంటుంబం బొమ్మలాటను వదిలిపెట్టి నాటకాలు ఆడితేనే ఇంటికి తిరిగి వస్తానని మొండికి వేశాడు గోవిందప్ప. అతడిని తీసుకొని వెళ్ళడానికి వేరే మార్గంలేక సరేనన్నారు తల్లిదండ్రులు.

అదృష్టం కొద్దీ కొద్ది రోజుల్లోనే వారికొక సదవకాశం లభించింది. 1885 "సొరుగు" (అదే ఇవాళ్టి"సురభి") గ్రామంలో పెద్దరైతులు అల్లపురెడ్డి చెన్నారెడ్డిగారింట్లో వివాహం. దానికి వనారస సోదరుల బొమ్మలాటను ఏర్పాటుచేశారు.

గోవిందప్ప పనుపున తాము బొమ్మలాటకు బదులు నాటకం వేస్తామని పెద్దలను ఒప్పించి ఆనాడు "కీచకవధ" నాటకం ప్రదర్శించారు. బొమ్మలాటలో "కీచకవధ" చాలా ప్రఖ్యాతమైన ఘట్టం. దానిని ఒకరాత్రి ఆడడం ఆనవాయితీ. ఆ రోజుల్లో బొమ్మలాటలలో అందరు నటీనటులకు గ్రంథం అంతా వచ్చివుండేది. ఆడవాళ్ళు ఆడబొమ్మల్ని (సైరంధ్రి, ఉత్తర మొ॥) మగవారు మగబొమ్మల్ని (భీముడు, కంకుభట్టు, కీచకుడు మొ॥) ఆడించేవారు. "బొమ్మలకు బదులు నటీనటులు తగిన వేషధారణతో రంగస్థలం మీదికి రావడమే నాటక ప్రదర్శన" అని తనవారిని సమాధానపరిచి ప్రదర్శించినర 'కీచకవధ' నాటకం అందరి మన్ననలు పొందింది. ఆ వివాహ శుభవేళ సురభి ఆవిర్భావం జరిగింది.

ఆ శుభముహూర్తం ఎటువంటిదోగాని ఆనాటి నుంచి ఈనాటి వరకు-120 సంవత్సరాలపాటు-సురభి నిత్యనూతనంగా కొత్త శోభలు తెచ్చుకుంటూ నవనవోన్మేషంగా కొనసాగుతోంది. దానికి అల్లపురెడ్డి చెన్నారెడ్డి, ఆయన బావమరిది రామిరెడ్డి చేసిన సాయం కలకాలం జ్ఞాపకం ఉంచుకోదగ్గది.

తొలి రోజుల్లో పెదరామయ్యగారి పాలనలో నడిచే రోజుల్లోనే చెన్నారెడ్డిగారు హిందూపురం నుంచి ఒక ప్రముఖ నటుడు రాప్తాటి సుబ్బదాసును రప్పించి వారిక నాటకాలు నేర్పడానికి నియోగించాడు. వనారస కుటుంబం సురభిలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని నిరంతరం నాటకాలు వేయడానికి కావలసిన వనరుల కల్పించాడు. సుబ్బదాసు నాలుగేళ్ళపాటు సురభివారితో పాటు ఉండి వారికి నాటకాలు రాసి యిచ్చి సంభాషణలు చెప్పడం, పద్యాలు పాటలు పాడటంలో శిక్షణనిచ్చాడు. 1887లో ఆ సమాజానికి శ్రీ శారదా మనోవినోదినీ సంగీత నాటక సమాజం అని పేరు పెట్టాడు. పేరు రామయ్యగారిదే కాని పెత్తనం గోవిందరావుగారిదే !

గోవిందరావుగారు నాటక సమాజానికి కొన్ని నియమాలు ఏర్పాటుచేశాడు. అందరూ కలిసివుండే సంస్కృతిని నేర్పాడు. బొమ్మలాటలలో తాము అనుసరించే "పాళ్ళ" పద్ధతి ప్రవేశపెట్టాడు. తాము ఎంత సంపాదించినా సమానంగా వాటాలు వేసి పంచుకోవడం పద్ధతిని అనుసరించాడు. నాటకానికి కావలసిన సర్వ పరికారాలను చినరామయ్య సహాయంతో సమకూర్చాడు. ఎక్కడ ఏ గొప్ప రచయిత తారసపడ్డా తమకోసం నాటకాలు రాయించుకున్నాడు. వారిని ఆదరించి సత్కరించేవాడు. రోజురోజుకూ శారదా మనోవినోదిని అసలు సిసలైన వృత్తి నాటక సంస్థగా రూపొందడానికి గోవిందరావు కార్యదీక్ష, పట్టుదల, దార్శనికతే కారణం. దానికి తండ్రుల సహకారం, అప్పచెల్లెళ్ళ చేయూత, చినరామయ్య, అంజునపప్పల తోడ్పాడు, పాపాబాయి, వెంకుబాయి వంటివారి సంగీత నటనా చాతుర్యం కూడా చేయూతనిచ్చాయి. స్త్రీ వేషాలకు పురుషులే ప్రసిద్ధిచెందిన ఆ రోజుల్లో స్త్రీలే స్త్రీ వేషాలు ధరించే ఏకైక సంస్థ సురభి. స్త్రీలందరూ చక్కని సంగీత, సాహిత్య జ్ఞానం వున్నవారు. రానురాను స్త్రీలు పురుష వేషం కూడా వేసి జనాన్ని మెప్పించేవారు.

గోవిందరావు, పెదరామయ్య, పాపాబాయిలు కలిసి నాటకాలు ఆడుతూ ఆంధ్రదేశంలోనేకాక బర్మాలోను, మద్రాసు, బెంగుళూరులలోను నాటకాలు ప్రదర్శించి మన్ననలు, సన్మానాలు పొందారు. నెలకు 15 నాటకాలు రోజువిడిచి రోజు ఆడుతూ, ఖాళీగా వున్న రోజున తరువాత నాటకానికి రిహార్సలు చేస్తూ రచయిత-దర్శకుడు చెప్పినట్లుగా తమ తమ పాత్రలను తీర్చిదిద్దుకునే క్రమశిక్షణ సురభివారి సొత్తు. దాదాపు 25 నాటకాలు నిర్విరామంగా ఆడగలిగిన సత్తా ఆ సంస్థది. మొదటి రోజుల్లో కీచకవధ, శాకుంతలం, హరిశ్చంద్ర ఎక్కువగా ఆడేవారు. ఆ తరువాత లంకా దహనం, సుభద్రా పరిణయం, లవకుశ ఆడడం మొదలు పెట్టారు. పార్శీ సమాజాల ప్రభావం ఎక్కువగా ప్రబలడం వల్ల జానపదాలు, కల్పిత నాటకాలు ఎక్కువగా ఆడేవాళ్ళు, చంద్రకాంత, కాంతామతి, ఆరు మరాఠీల కథ, వాటితోపాటు సంపూర్ణ రామాయణం, సతీసావిత్రి వంటివి ఆనాటి ప్రముఖ నాటకాలు.

పెరుగుతున్న మూడు కుటుంబాలు చాలాకాలం కలిసి వున్నాయి. 1914లో గోవిందరావు, చినరామయ్య యిద్దరూ విడిపోయి వేరు వేరు కంపెనీలు పెట్టుకున్నార. గోవిందరావు తన కంపెనీకి గోవిందరావు నాట్యమండలి అనీ, చినరామయ్య ఆయనతో అనీ పేర్లు ఉంచుకున్నారు. గోవిందరావు ఏలూరు దగ్గర పోలసానిపల్లెలో 1918లోనే ఇట్లు కట్టుకొని పిల్లలను పెద్ద భార్య సుబ్బమ్మనూ అక్కడ వుంచి తాను నాటకాలతో దేశ సంచారం చేస్తూ వుండేవాడు. గోవిందరావు రెండో భార్య లక్ష్మమ్మ చక్కని నటి. ఆమె ప్రధాన స్త్రీ పాత్రలు పోషించేది. మొదట్లో గోవిందరావే ప్రధాన పురుష పాత్రలు ధరించినా ఒకసారి రామాంజనేయ యుద్ధం నాటకంలో ఆంజనేయుడుగా భక్తి పారవశ్యంలో ఉండి రామనామం జపిస్తూ ఉండగా పొరపాటున నిప్పు అంటుకుని ఒళ్ళు కాలిపోవడం వల్ల ప్రధాన పాత్రలు వేయడం మానుకున్నాడు. అప్పుడు చినరామయ్య ప్రధాన పురుష పాత్రలు, లక్ష్మమ్మ స్త్రీ పాత్రలు ధరించేవారు.

సురభి సమాజం తొలినాటి చరిత్రలో వనారస చినరామయ్యకు ప్రత్యేకమైన స్థానం ఉంది. గొప్ప నటుడుగా, తామస రాజస వేషాలు రెంటినీ సమాన ప్రతిభతో చినరామయ్యే ! కర్టెన్లు రాయడం, వైరు వర్కు, కళ్ళు మూసి తెరిచేలోగా కర్టెన్లు మారి కొత్త సీను రావడం, లైటింగ్‌లో ఎప్పటికప్పుడు వినూత్నత్వాన్ని సాధించడం - ఇవి అన్నీ కూడా చినరామయ్య సాధించినవే !

గోవిందరావు ఇద్దరు భార్యలూ - పెదసుబ్బమ్మ, లక్ష్మమ్మ - అవేటి గంగయ్యగారి కూతుళ్ళు, పెదసుబ్బమ్మకు ముగ్గురు కొడుకులు, అయిదుగురు కూతుళ్ళు, పెద్దకొడుకు హనుమంతరావు ఒక్కడే నాటకాలతో ప్రమేయం లేకుండా విశాఖపట్నంలో మునిసిపల్ ఓవర్‌సీర్‌గా రిటైర్ అయ్యాడు. మిగిలిన ఇద్దరూ - వనారస సుబ్బారావు, కోటేశ్వరరావు తండ్రిగారి తదనంతరం గోవిందరాయ నాట్య మండలిని నడిపారు. కూతుళ్ళలో అంజనమ్మ, బాలమ్మ, ధనలక్ష్మీదేవి, నరసమ్మ, చెల్లాయమ్మ అంజనమ్మ తప్ప మిగిలిన అందరూ నాటకాలలో ప్రవేశించి కీర్తి ప్రతిష్టలు ఆర్జించినవారే! ధనలక్ష్మీదేవి, ఆమె భర్త పుల్లయ్య (ఈయన పాపాబాయిగారి ఏకైక కుమారుడు) ఒక కంపెనీ స్థాపించి నిర్విఘ్నంగా నిర్వహించారు. ఈనాటికి కూడా వారి పుత్రుడు ఎస్.ఏ.బాబూరావు, ఆయన కుమారుడు రామమోహనరావు శారదా విజయ నాట్యమండలిని నడుపుతున్నారు. వీరి కుమార్తె సురభి బాలసరస్వతి-ప్రఖ్యాత సినిమా నటి, బాబూరావు, ప్రకాశరావు, చంద్రరావు, లీలాపాపారావు-అందరూ మంచి నటులు, కంపెనీ నడిపినవాళ్ళు, వీరికోసం ప్రత్యేకంగా మాయబజార్, కురుక్షేత్రం, బాలనాగమ్మ, భూకైలాస్ రాయించుకుని ప్రదర్శించారు.

చెల్లాయమ్మ, ఆమె భర్త అవేటి నాగేశ్వరరావు సురభి న్యూ పూర్ణానంద డ్రమెటిక్ థియేటర్‌ను స్థాపించి ఆంధ్రదేశం నలుమూలలూ ప్రదర్శనలిచ్చి ప్రఖ్యాతిగాంచారు. చెల్లాయమ్మగారి చెల్లెలు పూర్ణిమ ముందు ఈ కంపెనీలో ప్రముఖ పాత్రలు ధరించేది. ఆ తరువాత ఆమె ఆంధ్ర నాటకరంగంలో ప్రఖ్యాత నటుల పక్కన ప్రధాన భూమికలు ధరించి ప్రఖ్యాత నటీమణిగా పేరెన్నికగన్నది. నాగేశ్వరరావు వసంతసేన వంటి కొత్త నాటకాలను రాయించి ప్రదర్శించారు. ఆయన సురభి నాటక కంపెనీలను అన్నింటినీ ఒక గొడుగు కిందకి తెచ్చాడు. సురభి నాటక కళాసంఘం స్థాపించి అందరినీ ఒకచోట చేర్చడంలో కృతకృత్యుడయ్యాడు.

గోవిందరావు రెండో భార్య లక్ష్మమ్మకు ఐదుగురు కుమార్తెలు, పెద్దకుమార్తె సుభద్రమ్మ రేకందార్ చినవెంకటరావును వివాహం చేసుకున్నది. వారిద్దరూ శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిని స్థాపించి విజయవంతంగా నిర్వహించారు. వారి పిల్లలు భోజరాజు ఈ మధ్యవరకు, ఇప్పుడు నాగేశ్వరరావు (బాజ్జీ) ఈ సంస్థను మంచి కట్టుబాట్లతో నడుపుతున్నారు. లక్ష్మమ్మ రెండవ కుమార్తె అవేటి పూర్ణిమ. అవేటి రామయ్య భార్య కొన్నాళ్ళు నాగేశ్వరరావుగారి కంపెనీ నడిపింది ఈమె. మూడవ కుమార్తె శాంతకుమారి, ఈమె భర్త అవేటి ప్రసాదరావు. ప్రసాదరావు, తమ్ముడు చలపతిరావులు ఇద్దరూ గజపతి నాట్యమండలి స్థాపించారు. కొడుకుల హయాంలో కూడా కొన్నాళ్ళూ విజయవంతంగా నడిచిన సంస్థ యిది. తరువాతి కూతురు నాగలక్ష్మి ఆమె భర్త అవేటి చలపతిరావు. వారు కొన్నాళ్ళు గోవర్ధన నాట్యమండలి పేర నాటక సంస్థను నిర్వహించారు. అలాగే ఆఖరి కూతురు షణ్ముఖమ్మ, ఆమె భర్త రామచంద్రరావు కూడా వసుంధరా నాట్యమండలిని స్థాపించి కొన్నాళ్ళు నడిపారు.

ఈ రకంగా తన కొడుకులను, కూతుళ్ళను కూడా నాటక సంస్థలో చేర్చి, చక్కని నటీనటులుగా తీర్చిదిద్ది వారు తమ తమ స్వంత కంపెనీలు నిర్వహించుకోవడానికి కావలసిన వనరులను సమకూర్చి పెట్టిన ఘనత గోవింరావుది. పుత్ర పౌత్రాభివృద్ధిగా యీ నాలుగు కుటుంబాలరావు (వనారస, అవేటి, రేకందార్, సింధి) తామరతంపరగా వృద్ధిచెంది ఆంధ్రదేశానికి వృత్తి నాటకాలు లేవన్న కొరతను తీర్చారు.

1914లో ప్రధాన సంస్థ రెండు సంస్థలైనట్లుగాను, మంది ఎక్కువ అయినప్పుడు వేరొక కంపెనీని స్థాపించడం, దానికి కావలసిన సామగ్రిని సమకూర్చుకోవడానికి సహాయం చెయ్యడం ప్రతి సంస్థలోను కనిపిస్తుంది. దీనికి మార్గం చూపినవాడు గోవిందరావు.

గోవిందరావు కేవలం నటుడు, నాటక సంస్థ నిర్వాహకుడు మాత్రమే కాదు. గొప్ప నాటక రచయితలచేత నాటకాల రాయించుకొని వారి ఆధ్వర్యంలో నాటకాలు ప్రదర్శించడానికి ప్రాచుర్యం కలిగించిందీ ఆయనే ! ముఖ్యంగా విశ్వనాథ కవిరాజుగారిచేత 28 నాటకాలు రాయించి ఆయన నేతృత్వంలో ప్రదర్శించాడు. పొలనానపల్లిలో దేవాలయాలు కట్టించాడు. ఎందరో పేద విద్యార్థులను చదివించాడు. ఈ కార్యక్రమాలన్నింటికీ ఆయనకు బాసటగా నిలిచినవాడు కొత్తపల్లి లక్ష్మయ్య. ఆయన కార్యదర్శి, కార్యదక్షుడు. విశ్వనాథ కవిరాజు, లక్ష్మయ్యల బాసటతో గోవిందరావు 1929లో తెనాలిలో మొదటి ఆంధ్ర

నాటక కళాపరిషత్తు సభలను దిగ్విజయంగా నడిపించాడు. 1932లో మద్రాసులో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తుకు అధ్యక్షత వహించాడు. 1937 లో ఏలూరులో గోవిందరావు సప్తతి మహోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. మహామహులంఎదరో ఆయన ప్రతిభకు నీరాజనాలు పలికారు. ఆయన 1953లో మరణించాడు.

1956 నాటికి - 70 సంవత్సరాలు పూర్తి అయ్యేనాటికి సురభి రాష్ట్రం నలుమూలలా విస్తరించి వుంది. పెదరామయ్య, కృష్ణాజీ, వెంకోజీల పిల్లలు - గోవిందరావు, చినరామయ్య, పాపాబాయిలతోపాటు వారి పిల్లలు కూడా నాటక సంస్థలు స్థాపించి, దానినే జీవికగా స్వీకరించడంతో పది ప్రధానమైన సంస్థలు, 27 చిన్న చిన్న సంస్థలు సురభి నాటక సంస్థలుగా పనిచేస్తూ వుండేవి. ప్రధానమైన సంస్థ అంటే - తగినతంత మంది నటులు, సాంకేతిక నిపుణులు వుండి, స్వంతంగా హాలు నిర్మించుకోవడానికి వీలైన టిన్నురేకులు, డైనమో, కావలసిన తెరలు, సాంకేతిక సామగ్రి వైగరాలన్నీ ఉన్న నిండైన వృత్తినాటక సమాజం. ఇక మిగిలినవాటికి వనరులు తక్కువ. నీనటులు తక్కువ. సాంకేతిక నైపుణ్యం తక్కువ అయినా సురభి పేరుతో తమ పొట్టగవడానికి రంస్థలం వారికి చేయూతనిచ్చింది.

ప్రధానమైన సంస్థలు - గోవిందరాయ సురభి నాట్యమండలి, శారదా మనోవినోదినీ నాట్యకళామండలి, శారదా విజయ నాట్యమండలి, వెఎంకటేశ్వర నాట్యమండలి, న్యూ పూర్ణానందా డ్రమెటిక్ థియేటర్స్, రమా సత్యనారాయణ నాట్యమండలి, విజయా నాట్యమండలి, గోవర్ధన నాట్యమండలి, గజపతి నాట్యమండలి, వసుంధరా నాట్యమండలి. ఇవి చాలావరకు గోవిందరావుగారి కుమార్తెలు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు నిర్వహించినవే.

ఇన్ని సంస్థలు ఆంధ్రదేశమంతటా విస్తరించి నాటక ప్రదర్శనలిస్తూ ఆంధ్రదేశంలో ప్రతిరోజూ ఏదో ఒక ఊరిలో సురభి నాటక ప్రదర్శన జరుగుతున్నది. అనే ప్రఖ్యాతిని పొందాయి. అయితే ఒకే ప్రాంతంలో పర్యటించడం కుదరదుకనుక ప్రదర్శనలు రానురాను పల్లెటూళ్ళకు మళ్ళించారు. రేడియోలు, సినిమాలు ఉధృతమై నాటకానికి పల్లెటూళ్ళకు కూడా టూరింగ్ టాకీసులు రావడంవల్ల సంస్థలు ఆర్థికంగా పుంజుకోలేక పోవడంవల్ల పెద్ద కంపెనీలు కూడా మూసుకోవలసిన అవసరం వచ్చింది. నాటకాలకే జీవితాన్ని అంకితం చేసిన చాలామంది సురభివారు యితర వృత్తులు చేపట్టక తప్పలేదు. ఈ ఆర్థిక ప్రభంజనాన్ని కూడా తట్టుకొని నిలబడని సంస్థలలో వెంకటేశ్వర నాట్యమండలి పేర్కొనదగినది. రేకందార్ చినవెంకటరావు, సుభద్రమ్మగారు స్థాపించిన యీ నాటక సంస్థను ప్రస్తుతం వారి మూడవ కుమారుడు నాగేశ్వరరావు నిర్వహిస్తున్నాడు. సమగ్రమైన సురభి నాటక లక్షణాలను సాధ్యమైనంత వరకు పోషిస్తూ హైదరాబాద్ పరిసరాల్లో నాటకాలు వేస్తూ పిల్లలను చదివించుకుంటూ వారిచేత కూడా నాటకాలు క్రమం తప్పకుండా వేయించే సంస్థగా పేరుపొందింది. బి.వి. కారంత్ వంటి ప్రఖ్యాతుల దర్శకత్వంలో ఆధునిక సంగీత ప్రధాన నాటకాలు కూడా ప్రదర్శించిన ఘనత ఈ నాటక సంస్థది. ఇందులో ఆడపిల్లలు కూడా విద్యాధికులై నాటకరంగం మీద తగిన కృషి చేస్తున్నారు.

ఇక రెండవ ముఖ్యమైన సంస్థ వినాయక నాట్యమండలి. ఈ సురభి సంస్థ చాలాకాలంగా పనిచేస్తున్నా, ప్రధాన సురభి సంస్థల పరిధిలోకి యిటీవలనే వచ్చింది. రేకందార్ రామారావు యీ సంస్థను ప్రారంభించారు. ఆయన కుమారులు రేకందార్ నరసింహారావు, ఆయన కుమారుల మోహనరావు, వేణుగోపాలరావు ప్రస్తుతం దీనిని జయప్రదంగా నడుపుతున్నారు. వీరు కూడా సరికొత్త నాటకాలను చేపట్టి నాటక ప్రదర్శనలను చక్కగా నిర్వహిస్తున్నారు.

శారదావిజయ నాట్యమండలికి చాలా సుదీర్ఘమైన చరిత్ర వుంది. ధనలక్ష్మీదేవి, అవేటి పుల్లయ్యగార్ల సంస్థ యిది. అయిదుగురు అన్నదమ్ములు కలిసివుండినప్పుడు అత్యద్భుతంగా సాగిన సంస్థ. రానురాను ఎక్కువ మంది కుటుంబ సభ్యులు కావడంతో ప్రతివారు ఒక వేరు సంస్థను స్థాపించుకొన్నారు. మిగిలినవన్నీ పోగా యిప్పుడు యీ సంస్థ మాత్రం పనిచేస్తున్నది. దీనికి ముఖ్యుడు ఎస్.ఎ.బాబూరావు. గొప్ప హార్మోనిస్టు, నటుడు, ఆయన కుమారుడు రామమోహనరావు ఆధ్వర్యంలో ఈ సంస్థ

నడుస్తున్నది.

నాల్గవది విజయభారతి నాట్యమండలి, ఇది నిజానికి గోవిందరావు సురభి నాట్యమండదలికి కొనసాగింపు సంస్థ. గోవిందరావుగారి కొడుకు సుబ్బారావుగారి పెద్దకుమారుడు గురుప్రసాద్ కొన్నాళ్ళు ఈ సంస్థను నిర్వహించారు. ప్రస్తుతం ఆయన మూడవ కుమారుడు దామోదరావు దీనికి అధిపతి. ఇదీ, శారదావిజయ నాట్యమండలి పరస్పరం సహకరించుకుంటూ నాటక ప్రదర్శనలను కొనసాగిస్తున్నాయి.

అయిదవది భానోదయ నాట్యమండలి. ఇది వినాయక నాట్యమండలి నుంచి కొత్త సంస్థ అయినా క్రమశిక్షణతో నడుస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల (సాంస్కృతిక) శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో ఈ అయిదు నాటక సంస్థలు బొటాబొటీ ఆదాయాలతో సంస్థలను నడుపుతున్నాయి. నాటకాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ క్రమశిక్షణతో నాటకాలు ప్రదర్శించినా యింకా ప్రేక్షకుల ఆదరణ తక్కువగానే వుంది. దానికి కొంత కారణం టి.వి.లు మరికొంత కారణం వారు చిన్న చిన్న పట్టణాలలోను, పెద్ద పల్లెటూళ్ళలోను ప్రదర్శలివ్వడం. ఈ సంవత్సరం సురభి సంస్థలు 120 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహాయ సహకారాలతో హైదరాబాద్‌లోని లలితకళాతోరణం ఆవరణలో అన్ని సమాజాలు కలిసి ఒక సంవత్సరంపాటు ప్రదర్శనలివ్వడం ప్రారంభించింది. ప్రేక్షకుల మన్నన బావుంది. ఇటువంటి ప్రయత్నమే ప్రభుత్వం ఇతర ముఖ్యమైన పట్టణాలలో కూడా చేస్తే సురభికి వెనకటి వైభవం తిరిగి రావడం అసంభవం కాదు. అయితే దీనికి సురభి సంస్థలు కూడా తమవంతు ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా ఈనాడు సురభి సంస్థలన్నీ నటనకన్నా సాంకేతిక విషయాలకు, ట్రిక్కులకు ప్రాధాన్యాన్నిస్తున్నాయి. ఇవి తాత్కాలిక ఆనందాన్ని కలిగించేవే ! దీనికితోడు మంచి వాచిక విన్యాసం, సంభాషణాపటిమను, పద్యాన్ని పాటలను పాడడంలో నేర్పరితనాన్ని పెంచుకోవలసిన అవసరం, యీనాటికి తగిన విధంగా కొత్త వస్తువులతో తమకు తగిన పద్ధతులలో నాటకాలను వ్రాయించుకొని ప్రదర్శించడం అత్యావశక్యకం.

సురభి నాటక సంస్థలు స్వయంపోషకాలై యింతకాలం కొనసాగడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు కనిపిస్తాయి. వాటిలో ఒకటి వాటి అన్నింటికీ కొన్ని ప్రత్యేకతలు గల స్వంత హాళ్ళు వుండడమే ! ప్రతి సంస్థ ఏ ఊరుకు వెళ్ళినా తమ స్వంత హాలును నిర్మించుకుంటారు. దీనికి కావలసిన రేకులు, బాదులు, కర్టెన్లు, పక్కకర్టెన్లు, కుర్చీలు, లైట్లు, మైక్రోఫోన్లు, ఇతర సామగ్రి-డైనమోతో సహా-వారు సంతరించుకుంటారు. ఈ హాలు మామూలుగా 150 అడుగుల పొడవు, 48 అడుగుల వెడల్పు ఉంటుంది. రంగస్థలం 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు వుంటుంది. రంగస్థలం 20 అడుగుల ఎత్తు, రంగస్థల తోరణం నుంచి 10 అడుగుల ఎత్తు ఉంటాయి. రంగస్థలం ముందుభాగంకన్నా వెనక మరో 10 అడుగుల ఎత్తు వుండడానికి ఆపై భాగంలోకే అన్ని కర్టెన్లు పోవడం, అక్కడ నుంచే పై నుంచి దిగివచ్చే పాత్రలు అన్నీ ప్రవేశించడం ముఖ్యమైన కారణం. నాటకశాల చుట్టూ వంద అడుగులకు తక్కువ కాకుండా ఖాళీ ప్రదేశం వుంటుంది. రంగస్థలం రెండు పక్కలా నటీనట కుటుంబాలకు వసతి వుంటుంది. దీని వలన అందరూ సమైక్యంగా ఒకచోటనే వుండి రిహార్సలు చేయడం, ప్రదర్శనలివ్వడం తేలిక అవుతుంది.

సురభివారి నాటక తెరలు ఆయా నాటకాల అవరాలకు అనుగుణంగా కంపెనీలలో ఉండే సురభి కళాకారులే వ్రాసినవి. ప్రతి స్థిరమయిన కంపెనీకి 15 నుంచి 20 కర్టెన్లు ఉంటాయి. ఇందులో కొన్ని రోడ్డు, దర్బారు, కోట, అడవి, ఉద్యానవనం - అన్ని నాటకాలకు పనికివచ్చేవి. అవికాక ప్రతి నాటకానికి అవరసమైన పలు కర్టెన్లు వేరు వేరుగా రాయిస్తారు. ఒక కర్టెను పైకి పోయి మరో కర్టెను దిగడానికి రెప్పపాటు కాలం చాలు. ప్రత్యక్షాలు, అంతర్థానాలు, పాత్రల ఆహార్యం మార్పు, అకస్మాత్తుగా మంటలు రావడం. ఆదిశేషుడు కృష్ణుడికి పడగ పట్టడం, నది వసుదేవుడికి దారి యివ్వడం వంటి సీన్లు ప్రతి నాటకంలోనూ అలరించే దృశ్యాలు. ఈ దృశ్యాల అమరిక రంగస్థలం పైభాగాన వుండే స్థలంలోకాని, కింద రంగస్థలం అంచున కట్టిన

/

గుడ్డవెనకాల గాని జరిగే విధంగా నిబంధిస్తారు.

అలాగే కాంతి ప్రసరణ యంత్రాలను కూడా జాగ్రత్తగా అమర్చుకుంటారు. సురభి నాటకాలలో కాంతి ప్రసరణకు ప్రాధాన్యం ఉంది. ఇవ్వాల్టి పద్ధతులతో డిమ్మర్లు, స్పాట్లు వంటి ఆధునిక పరికరాలను వాడుకుంటారు. ఎవరి వేష రచన, వస్త్రధారణ వారే చూచుకుంటారు. ప్రతి చిన్నపిల్లవాడు, అమ్మాయి కూడా ఆహార్యం విషయంలో మరొకరి సహాయం అక్కర్లేకుండా తయారవుతారు. ప్రతి నాటకానికి ఆయా పాత్రలకు కావలసిన దుస్తులను, పరికరాలను సంస్థ తయారుచేసి ఆయా నటుల దగ్గర ఉంచుతుంది. ప్రతి నాటక సంస్థకి ఒక హార్మొనిస్టు (ఇప్పుడు కాసియో వాద్యగాడు), తబలా కళాకారుడు తప్పకుండా వుంటారు. ప్రతి నటుడు, నటి తమ తమ పద్యాలను, పాటలను విధిగా పాడుకుంటారు కనుక వారికి పగటిపూట తరిఫీదు యిస్తారు.

టిక్కెట్లతో నాటక ప్రదర్శనలిచ్చే సంస్థలు కనుక నాటకశాలలో ఈ టిక్కెట్లకు అనువుగా మూడు విభాగాలు చేసేవారు. రంగస్థలం ముందుగా ఒక పిట్ తవ్వి అందులో కుర్చీలు, ఆ వెనుక బెంచీలు వేస్తారు. ఆ వెనుక మామూలు సమతలం మీద చాపలు వేసేవారు. ఇప్పుడు చాపలు పోయి అన్నిచోట్ల కుర్చీలు వేస్తున్నారు. 1900 ప్రాంతాల ఈ టిక్కెట్లు అర్ధరూపాయి, పావలా, అణా వుండేవి. ఇప్పుడు 15 రూపాయలు, 10 రూపాయలుగా రెండే తరగతులు వుంటున్నాయి.

మహారాష్ట్ర దేశం నుంచి ఆంధ్రదేశానికి వలసవచ్చి ఆంధ్రుల జీవితంతో మమేకం అయిపోయిన సురభివారు ఆరెమరాఠీలు. కాని తమ నాటక వాచికానికి అడ్డం వస్తున్నదన్న దృష్టితో యింటి వద్ద పూర్వం మాట్లాడే 'ఆరె' భాషను మాట్లాడకూడదని నిర్ణయం తీసుకున్నారు. నూటికి నూరు శాతం తెలుగు పలుకుబడితో స్వచ్ఛమైన భాషను మాట్లాడడం ఇవాళ వారికి వెన్నతో పెట్టిన విద్య, అలాగే రాములవారు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయుడు వారి ఇష్టదైవాలు. తెలుగు పండగలన్నింటినీ ఆనందంగా జరుపుకుంటారు. కులదైవం అంబను పూజిస్తారు.

వివాహాలు ఎక్కువగా వారి కుటుంబాల మధ్యే జరుపుకోవడం ఆనవాయితీ. వనారసవారి కుటుంబాలు మిగిలిన అవేటి, రేకందార్, సింధిలతో వియ్యమందుతారు. ఆయా సమయాలకు అనుకూలంగా బయటివారితో వియ్యమందడం వారికి అయిష్టం కాదు. మొదటి తెలుగు చలనచిత్ర కథా నాయిక పాపాబాయి (సంజీవరావుగారి రెండో గంగిరెడ్డిని వివాహం చేసుకున్నది. ఆమెను వివాహం చేసుకోవడానికి గంగిరెడ్డిగారు ఇంటిపేరును 'అవేటి'గా మార్చుకున్నారు. ఇలా అడపాదడపా బయటి సంబంధాలు చేసుకుని సురభి వారితో కలిసి జీవిస్తున్న కుటుంబాలు లేకపోలేదు.

పూర్వం నాటకాలమీద వచ్చిన ఆదాయాన్ని, నాటక ప్రదర్శనల ఖర్చుల కోసం కొంత తీసి పక్కనపెట్టి మిగిలినవి ఇంటికి ఆ ఇంట్లో వున్న జనాభా దామాషాన పాళ్ళు వేసి పంచుకొనేవారు. కాని డబ్బు సరిగా రానప్పుడు వెసులుబాటులేని నటకుటుంబాలు ఇబ్బందిపడడం మొదలైంది. అందువల్ల నాటక కంపెనీ స్థాపక కుటుంబవాళ్ళే అన్ని ఖర్చులు భరిస్తూ నటీనటులకు నెలవారి జీతాలు ఏర్పాటు చేశారు.

సురభి నాటకాలలో బహు గొప్ప లక్షణం తాము చేస్తున్న వృత్తియెడ ఉంటే ఆదరణ. వృత్తి ధర్మం, పిల్లలు పుట్టడం దగ్గర నుంచి చనిపోవడం వరకు అన్నీ రంగస్థలం మీదనే ఇవాల్టికీ జరుగుతున్నాయంటే - ఎన్ని అడ్డంకులు వచ్చినా నాటకం ఆగకూడదనే వారి వృత్తిధర్మమే కారణం.

"కీచకవధ"తో 1885లో ప్రారంభమైన సురభి నాటక చరిత్రలో ఎందరో రచయితలు వారికి నాటకాలు రాసియిచ్చారు. తగిన పారితోషికం పొందారు. కీచకవధ బొమ్మలాట పాఠ్యం అనుకున్నాం. తరువాత హరిశ్చంద్ర, సారంగధర, శాకుంతల నాటకాలను రాప్తాటి సుబ్బదాసు రాసియిచ్చాడు. కాశీ మజిలీ కథలు ఆధారంగా కొంత, అప్పటి పార్శీ కంపెనీ కథల నుంచి

కొంత కథలను స్వీకరించి స్త్రీ సాహసం, జగన్మోహిని నాటకాలను కృష్ణాజీ రాశాడు. అలాగే విశాఖపట్నానికి చెందిన మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు తాను రాసిన పారిజాతాపహరణము, బిల్హణీయము సురభివారికి యిచ్చారు. వరుుల చింతామణి శాస్త్రిగారు చంద్రకాంత నాటకం రాసియిచ్చారు. బొబ్బిలికి చెందిన బులుసు సీతారామశాస్త్రి దశావతారాలు, మల్లాది అచ్యుతరామశాస్త్రి జగన్మోహన సురభివారికోసం రాశారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తాము రాసిన సీతాకళ్యాణం, నరకాసుర వధ నాటకాలను సురభివారు ఆడుకోవడానికి అనుమతినిచ్చారు. బళ్ళారి కె. సుబ్రహ్మణ్యశాస్త్రి, చక్రావధానుల మాణిక్యశర్మలు కూడా సురభివారి కోసం నాటకాలు రాశారు.

అయితే, గోవిందరావుగారు, ఆయన 28 నాటకాలు సురభివారికోసమే రాశాడు. ఆ తరువాత పేర్కొనదగిన రచయితలు మల్లాది వెంకటకృష్ణశర్మ, ఆయన దాదాపు అన్ని కంపెనీలకు నాటకాలు రాసిపెట్టాడు. ఈ విధంగా ఆంధ్రదేశంలో ప్రసిద్ధులయిన నాటక రచయితల నాటకాలను ఆడడంలో సిద్ధహస్తులనిపించుకొన్నారు సురభివారు.

వృత్తి నాటక సమాజాలలో సమిష్టి నాటక ప్రదర్శనలే ముఖ్యం, అయినా కొందరు ప్రఖ్యాత నటీనటులను గురించి నాటక ప్రదర్శనలే ముఖ్యం. మొదటి తరంలో పెదరామయ్య, గోవిందరావు, పాపాబాయి, లక్ష్మమ్మ, చినరామయ్య ముఖ్యులు. వారి పిల్లల తరంలో అవేటి ధనలక్ష్మీదేవి, రేకందార్ సుభద్రమ్మ, అవేటి పూర్ణిమ, అవేటి నాగేశ్వరరావు, శాంతకుమారి, వనారస సుబ్బారావులు ముఖ్యులు. ఆ తరువాత అవేటి బాబూరావు, ప్రకాశరావు, లీలాపాపారావు, రేకందార్ భోజరాజు, అవేటి శ్యామ్‌సుందర్, అవేటి మనోహర్ పేరు తెచ్చుకున్నారు. ఈ వర్తమాన తరంలో యువతీ యువకులు శ్రమించి నాటకాన్ని ముందుకు తీసుకొనిపోయే ప్రయత్నం చేస్తున్నారు. బాబ్జీ, మోహనరావు, వేణుగోపాల్, రామమోహనరావు, దామోదరరావు, నాగేశ్వరరావు, వసంతకుమార్ వంటివాళ్ళు సురభి నాటకాల పునరుజ్జీవనానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం మాత్రమే కాక, శ్రీ రమణాచారి ఐ.ఎ.ఎస్. వంటి ఆఫీసర్లు వారికి అండదండలుగా నిలిచి సహాయ సహకారాలందిస్తున్నారు. కీర్తిశేషుడు గరిమెళ్ళ రామమూర్తి వారికోసం అహరహం శ్రమించాడు. ఇందరి ఆదరాభిమానాలను పొందుతూ, తెలుగునాట ఒక వృత్తి నాటక సమాజంగా నిలిచి తన సేవనలు అందించడానికి సురభి సంస్థ బహుధా ప్రయత్నం చేయాలని నా కోరిక.